# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ గొప్ప నగరంగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు.**

3. **అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అమరావతిలో ఐకానిక్ భవనాలను నిర్మిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్ సముద్ర జలాల్లో తమిళనాడు పడవల చొరబాట్లు అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.**

5. **ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినాన్ని ఈ రోజు జరుపుకుంటున్నాం.**

==========================

ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి సమీపంలోని రాజయ్యపేటలో నిర్మించనున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ ఉక్కు కర్మాగారానికి కేంద్ర మంత్రులు హెచ్ డి కుమారస్వామి, భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తో కలిసి నిన్న భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖా మంత్రి హెచ్.డి. కుమారస్వామి ప్రసంగించారు. ఉక్కు పరిశ్రమలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామన్నారు విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థిక సహకారం ద్వారా ఉత్పత్తి పెంచేలా చర్యలు చేపట్టామని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, దేశంలో పెట్టుబడులకు రాష్ట్రం గమ్యస్థానంగా మారిందన్నారు. 1.35 లక్షల కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఈ కర్మాగారం ఉత్తరాంధ్రలో లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్..25.. సెకన్లు

-------------------------

ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ గొప్ప నగరంగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి

ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ లపై అడిగిన శాసనమండలి సభ్యులు అడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానమిస్తూ.... ప్రాంతాల మధ్య దూరం తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్నామని, హైదరాబాద్ నగరం మధ్య నుంచి అన్ని ప్రాంతాలకూ వీటిని విస్తరిస్తామని చెప్పారు. బాహ్య వలయ రహదారి –ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల రేడియల్ రహదారులను నిర్మిస్తున్నామన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మారిస్తే మూసీ సుందరీకరణ త్వరగా పూర్తవుతుందని దీంతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని ముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అమరావతిలో ఐకానిక్ భవనాలను నిర్మిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. కాకినాడలో జరిగిన జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో జిల్లా ఇన్ఛార్జి మంత్రి నారాయణ నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరావతి నిర్మాణాలపై మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ .. 30 .. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్ల కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరంలో 100 ఎంబిబియస్ ప్రవేశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖా మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ప్రభుత్వ వైద్య కళాశాల నియామకాలు, పనుల ప్రగతిపై అమరావతి నుంచి దృశ్య మాధ్యమం విధానంలో సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకం కింద నిర్మిస్తున్న ఈ కళాశాల కోసం కేంద్ర ప్రభుత్వం 195 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని తెలిపారు. 450 కోట్ల రూపాయల వ్యయంతో 47 ఎకరాల విస్తీర్ణంలో ఈ జరుగుతున్న నిర్మాణ పనులను మే 15వ తేదీ లోపు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

రాష్ట్ర సముద్ర జలాల్లో తమిళనాడు పడవ చొరబాట్లు, ఆంధ్రప్రదేశ్ ప్రాంత మత్స్యకారుల సమస్యలపై శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నిన్న విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమిళనాడుకు చెందిన నాలుగు మరపడవలను స్థానిక మత్స్యకారులు స్వాధీనం చేసుకుని జువ్వెలదిన్నె రేవులో ఉంచినట్లు తెలిపారు. తమిళనాడు పడవ చొరబాట్లు అడ్డుకునేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి పేర్కొంటూ,.

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన 8 లక్షల 22 వేల 796 రూపాయల చెక్కులను విశాఖపట్నంలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన నిన్న అందజేశారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ... అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు వైద్య చికిత్స కోసం ప్రభుత్వం ముఖ్యమంత్రి

సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు.

---------------------------

ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. రోబర్ట్ కోచ్ (Robert Koch ) అనే శాస్త్రవేత్త 1882 వ సంవత్సరం మార్చి 24వ తేదీన క్షయ వ్యాధి కారకమైన క్రిమి మైక్రో బాక్టీరియా ట్యూబర్ క్యులోసిస్‌ను కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా ఇదేరోజు క్షయవ్యాధి నివారణా దినాన్ని జరుపుకుంటున్నారు. క్షయ వ్యాధిని, తొలి దశలోనే గుర్తించి సరైన చికిత్స, మందులు తీసుకుంటే నివారణ సాధ్యమని, ప్రజలలో అవగాహన కల్పించేందుకు, క్షయ వ్యాధి రహిత సమాజ సాకారమే లక్ష్యాలుగా ప్రపంచ ఆరోగ్యసంస్థ 1995వ సంవత్సరం నుంచి ప్రతి ఏటా మార్చి 24వ తేదీన ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలనా దినాన్ని నిర్వహిస్తోంది.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో గరిష్ఠ సంఖ్యలో రాజీపడదగ్గ కేసులు పరిష్కరించేందుకు పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని డీజీపీ కార్యాలయం నుంచి దృశ్య మాధ్యమం విధానంలో పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్యాం కోశీతో కలిసి డీజీపీ నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈసారి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ముఖ్యంగా పాత ట్రాఫిక్ చలాన్లు ఎక్కువగా ఉన్నందున వాటిని పరిష్కరించేందుకు దృష్టిసారించామని, దాంతోపాటు రాజీపడదగ్గ కేసులు గుర్తించి, ఇరుపక్షాలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.

---------------------------

ఉత్తరాంధ్ర దాని పరిసర ప్రాంతాలపై సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని, దీనితోపాటు తమిళనాడు, అంతర్గత కర్ణాటక మీదుగా ద్రోణి విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

తెలంగాణలోనూ రానున్న మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని బీసీ వసతి గృహాలు, గురుకులాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బీసీ కళాశాల బాలికల వసతి గృహాన్ని స్థానిక శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి నిన్న ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాల గదులు, వంటగదిని తనిఖీ చేశారు.

=====================